క్లుప్తంగా

ఎస్సైగా ఎంపికైన సత్యవతికి సత్కారం



సత్యవతిని సత్కరిస్తున్న సంఘ నేతలు

రామచంద్రపురం: మండలంలోని నవరత్నాల గరువు గ్రామానికి చెందిన మేడిశెట్టి లక్ష్మీ సత్యవతి ఇటీవల ఎస్సై పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విషయం తెలిసిందే. మండలం శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని తాలూకా శెట్టిబలిజ సంఘ కార్యాలయంలో లక్ష్మీ సత్యవతిని గురువారం ఘనంగా సత్కరించారు. శెట్టిబలిజ సంఘ మండల అధ్యక్షుడు దొంగల శ్రీధర్, ఉపాధ్యక్షుడు నరాల సురేష్ ఆధ్వర్యంలో సత్యవతిని నూతన వస్త్రాలతో సత్కరించారు. సంఘ నాయకులు శీలం గంగరాజు, కట్టా రాధాకృష్ణ, మేడిశెట్టి సూర్యనారాయణ, వాసంశెట్టి బాల, కొప్పిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసే విధానంపై అవగాహన



కేశవరంలో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారి

కపిలేశ్వరపురం (మండపేట): రానున్న ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సెక్టార్ ఆఫీసర్ ఏసుబాబు అన్నారు. మండపేట మండలం కేశవరం సచివాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఓటర్లకు ఈవీఎం యంత్రం పనిచేసే విధానం, ఓటు వేసే విధానం, ఓటు జాబితాలో తమ ఓటును తనిఖీ చేసుకునే విధానాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సలాది శివ, తుపాకుల ప్రసన్నకుమార్, రాంచంద్రరావు, ఓటర్లు పాల్గొన్నారు.

వాణిజ్య విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శిగా అప్పారావు



కె.గంగవరం: కుందూరు గ్రామానికి చెందిన బత్తుల అప్పారావు వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయన ఉత్తర్వులు అందుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ పంపన నాగమణి, పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, బీసీ నాయకులు బత్తుల అప్పారావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అప్పారావుకు అభినందలు తెలిపారు.

తండ్రి అదృశ్యంపై ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేటకు చెందిన వెన్నా శ్యామ్‌సుందరరావు కనిపించడం లేదని అతని కుమారుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర విలేకరులకు తెలిపారు. గురువారం ఉదయం పనికి వెళ్లి, పది గంటలకు ఇంటికి తిరిగొచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాకపోవడంతో అతడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కళాకారుల సంఘ సమావేశం

మామిడికుదురు: కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘ సమావేశం మామిడికుదురులో గురువారం జరిగింది. ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ అందించాలని కోరింది. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి శంకరరావు స్వగృహం వద్ద సంఘ వ్యవస్థాపకుడు మంగం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు ఈలి శ్రీనివాసరావు, ఉండ్రు శ్రీరామారావుతో పాటు పలువురు కళాకారులను సత్కరించారు.

విజయవాడకు భవానీల బృందం పాదయాత్ర

మామిడికుదురు: ఉప్పలగుప్తం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధికి 15 మంది భవానీల బృందం పాదయాత్రగా వెళ్తోంది. ఈ బృందం గురువారం మామిడికుదురు చేరింది. ఈ సందర్భంగా కోలా దొరబాబు, కుమారి మాత దంపతులు మాట్లాడుతూ 27న బుధవారం ఉప్పలగుప్తం నుంచి పాదయాత్రగా విజయవాడ బయలు దేరామన్నారు. 270 కి.మీ. మేర పాదయాత్ర నిర్వహించి, ఈ నెల 31న విజయవాడ చేరుకుంటామని చెప్పారు. గతంలో ఓసారి విజయవాడ పాదయాత్రగా వెళ్లామన్నారు. ఇరుముడులు రథంలో పెట్టుకుని, రథాన్ని లాగుతూ భవానీలు పాదయాత్రగా విజయవాడ వెళ్తున్నారు. వీరికి స్థానిక భవానీలు స్వాగతం పలికారు.

బొట్టుబొట్టునూ ఒడిసిపట్టు

- సాగునీటి సరఫరాలో శాస్త్రీయత
- రెండు నియోజకవర్గాల్లో 1,01,732 ఎకరాల్లో వరి సాగు
- 11,58,33,750 మిల్లీ మీటర్ల నీరు అవసరం



సాగునీరు

కపిలేశ్వరపురం: వరి సాగులో అత్యంత కీలకమైనది సాగునీటి సరఫరా... రబీ సాగు వరినాట్లు వేయడం నుంచి పంట చేతి కందే వరకూ పంట పరిస్థితుల ఆధారంగా ప్రణాళికాబద్ధంగా నీటిని అందించాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వం సాగునీటి సరఫరాపై అంచెలంచెలుగా చర్చలు జరిపి విజయవంతంగా నీటిని అందిస్తోంది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో సాగు నీటి సరఫరా తీరుతెన్నులపై ఈ కథనం ...

పక్కా ప్రణాళిక ప్రకారం

రైతు పక్షపాతిగా పేరొందిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంట సాగులో ముందస్తు ప్రణాళికను రూపొందిస్తూ ముందుకు సాగుతోంది. దానిలో భాగంగా ఖరీఫ్ సాగు కొనసాగుతుండగానే రబీ సాగుపై దృష్టి సారించింది. సాగునీటి సరఫరాకు ఇరిగేషన్, అనుబంధ శాఖలతో జిల్లా స్థాయిలో సమీక్షలు జరిపి, పక్కా ప్రణాళికను రూపొందించారు.

క్షేత్ర స్థాయిలో వరి సాగు నీటి అవసరం ఇలా...

మండలం	గ్రామాల సంఖ్య	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	అవసరమైన నీరు (మిల్లీ మీటర్లలో)
రామచంద్రపురం	25	18,806	2,35,07,500
కె.గంగవరం	26	15,633	1,95,70,000
కాజులూరు	26	19,382	2,34,83,750
మండపేట	12	16,985	2,11,15,000
రాయవరం	12	14,593	1,83,07,500
కపిలేశ్వరపురం	19	16,333	1,98,50,000
మొత్తం	120	1,01,732	11,58,33,750

తోడ్పాటు ఇస్తున్న సాగు సలహా మండళ్లు

ప్రస్తుత ప్రభుత్వం రూపొందించిన వివిధ దశల్లోని సాగు సలహా మండళ్ళు సాగు ప్రక్రియకు తోడ్పాటు ఇస్తున్నాయి. ఆర్‌బీకే స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ప్రభుత్వం సాగు సలహా మండళ్లను ఏర్పాటు చేసింది. దీంతో స్థానిక రైతు సూచనలు, సలహాలు సైతం పైస్థాయిలో తీసుకునే నిర్ణయాల్లో భాగమవుతున్నాయి. ఆ మండళ్లలో రెవెన్యూ, జల వనరులు, వ్యవసాయ శాఖల భాగస్వామ్యం ఉండడంతో పటిష్టమైన నిర్ణయాలకు అవకాశం ఏర్పడుతుంది.

రెండు నియోజకవర్గాల్లో సాగు ఇలా...

ఒక ఎకరా వరి సాగు కాలం మొత్తానికి 1,250 మిల్లీ మీటర్ల నీరు అవసరం. రామచంద్రపురం నియోజకవర్గంలో 75 గ్రామాల్లోని 53,821 ఎకరాలకు 6,65,61,250 మిల్లీ మీటర్లు, మండపేట నియోజవర్గంలో 43 గ్రామాల్లోని 47,911 ఎకరాలకు 4,92,72,500 మిల్లీ మీటర్లు, మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 1,01,732 ఎకరాలకు 11,58,33,750 మిల్లీ మీటర్ల సాగునీరు అవసరం అవుతుంది.

అవగాహన అవసరం



ఆయకట్టు ఎగువ భూముల రైతులు ఎక్కువ నీటిని వినియోగిస్తుండడంతో దిగువ రైతులకు సమస్య ఎదురవుతుంది. దీంతో వారి భూముల్లో దిగుబడి తగ్గే పరిస్థితులొస్తాయి. నేలలో పైరుకు తడి 75 శాతం వరకూ తగ్గిపోతే నీటి ఎద్దడి ఉందంటారు. అలాగని అవసరం రాకుండా ముందస్తుగా నీరును పెట్టినా ప్రాణవాయువు దక్కక పంట దిగుబడి తగ్గిపోతుంది. నాట్లు వేసేటపుడు నీరు పలచగానూ, మూన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బు చేయడం పూర్తయ్యే వరకూ 2 సెంటీమీటర్ల నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టి పడే వరకూ 5 సెంటీమీటర్ల నీరుండాలి. ఈనిక దశ, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిలోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త వహించాలి. కోతకు పది రోజులు ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు బాగా చేయదు.

–కేవీఎస్ రమేష్ కుమార్, ఏఓ, కపిలేశ్వరపురం మండలం

క్రీడలను ప్రోత్సహించేందుకే..

- 'ఆడుదాం ఆంధ్ర'
- వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్
- చెల్లూరు, కేశవరంలలో ఆటల పోటలు ప్రారంభం



చెల్లూరులో క్రీడాకారులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్

రాయవరం: గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తీసి వారిని మరింతగా ప్రోత్సహించే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పేర్కొన్నారు. అడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెల్లూరులో నిర్వహిస్తున్న గ్రామ స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, పార్టీ నేతలు పాలిక గోవిందు, నల్లమిల్లి వెంకటరెడ్డి, పలివెల రామకృష్ణ, పిల్లి సుబ్రహ్మణ్యం, మేడిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

ఆటలకు అధిక ప్రాధాన్యం

కపిలేశ్వరపురం: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గ్రామీణ ఆటలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండపేట మండలం కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం క్రీడలను ఆయన ప్రారంభించారు. పలు విభాగాల ఆటలను పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు కరుపూడి భవాని, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు ప్రారంభించారు. పృథ్వీరాజ్, తదితర నాయకులు క్రికెట్, షటిల్, వాలీబాల్ తదితర ఆటలను ఆడి అలరించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు పలివెల సుధాకర్, సమతం చిన్న పాపారావు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పలుకూరి వెంకన్న బాబు, గని పోతురాజు ఆలయ కమిటీ చైర్మన్ కూసు అబ్బు, కేశవరం లారీ యూనియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంధం సూరిబాబు, వ్యాయామోపాధ్యాయులు ముక్కపాటి చినబాబు, మేడిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

క్రీస్తు బోధనలు విశ్వ శాంతికి మార్గం



పడమర ఖండ్రిక క్రిస్మస్ వేడుకల్లో శుభాకాంక్షలు చెబుతున్న పృథ్వీరాజ్



రాక్ చర్చి క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ అంబటి భవాని

కపిలేశ్వరపురం: ఏసు క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి మార్గాన్ని చూపుతాయని వైఎస్సార్ సీపీ యువ నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ అన్నారు. పడమర ఖండ్రికలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చర్చి నిర్వాహకులు జి.రూబెన్ బైబిల్ ప్రాధాన్యతను వివరించారు. గాయకులు ఏసును కీర్తిస్తూ గీతాలు ఆలపించారు. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని వివరిస్తూ కళా ప్రదర్శన ఇచ్చారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ కన్వీనర్ పాలింగి కృష్ణ కిశోర్, సచివాలయాల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, క్రైస్తవ భభక్తులు పాల్గొన్నారు.

రాక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

రామచంద్రపురం రూరల్: రాయ చెరువు గ్రామంలో రాక్ చర్చి వద్ద బుధవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ అంబటి భవాని, నెహ్రూ దంపతులు, సర్పంచ్ పిల్లి సూర్యప్రకాశరరావు, బిషప్ కనికెళ్ల ఆనందకుమార్, ప్రత్యేక అతిథి డి.స్వరూప కేక్ కట్ చేసి విశ్వాసులకు పంచి పెట్టారు. మానవులంతా ఇతరులపై ప్రేమను కలిగి ఉండాలని పాస్టర్ ఆనంద్‌కుమార్, డి.స్వరూప పేర్కొన్నారు. అనంతరం పేదలు, వృద్ధులకు దుస్తులు అందజేశారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

కౌన్సిల్‌లో 15 అంశాలు ఏకగ్రీవం



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పురపాలక పరిధిలో స్వచ్ఛతే ప్రాధాన్యంగా పనులు చేపడుతున్నట్టు రామచంద్రపురం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశ మందిరంలో సాధారణ కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. చైర్‌పర్సన్ శ్రీదేవి అధ్యక్షత వహించారు. మొత్తం 15 అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన 12 అంశాలకు గాను పరిపాలన అమోదం కొరకు సభ్యులకు వివరించగా వాటిని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. చెత్తను సేకరించే 40 పుష్కార్ట్లను రూ.6.93 లక్షలతో తయారు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కొత్త జెరాక్స్ మెషీన్ కొనేందుకు సభ్యులు ఆమోదించారు. గడప గడపకూ.. కార్యక్రమంలో భాగంగా 3, 4, 9, 10, 11, 12, 1 సచివాలయాల పరిధిలో గుర్తించిన సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు రూ.4 కోట్లతో జరిపే పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. కమిషనర్ టి.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కోలమూరి శివాజీ, విప్ వాడ్రేవు సాయిప్రసాద్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



అమలాపురంలో పురంధేశ్వరికి సమస్యలు చెబుతున్న శివశంకర్

కపిలేశ్వరపురం (మండపేట): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి మండపేట మండలం ద్వారపూడికి చెందిన అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన పురందేశ్వరిని అమలాపురంలో వేదిక నాయకులు కలిసిన సమస్యలను విన్నవించుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నీరుకొండ శివశంకర్ మాట్లాడుతూ దివ్యాంగుల ప్రయోజనాలు నిమిత్తం 2016లో రూపొందించిన చట్టాన్ని అమలు చేయాలని కోరామన్నారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచాలని, ఉద్యోగాల్లో దివ్యాంగుల రోస్టర్ పాయింట్‌ను 10 లోపు తగ్గించాలని, ఎప్పటికప్పుడు బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రైవేటు ఉద్యోగాల్లో సైతం రిజర్వేషన్లను అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరినట్టు వేదిక నాయకులు శివశంకర్, కోటిపల్లి వీరాస్వామి, ఏకుల వీరమల్లికార్జునరావు, పెబ్బులి కన్నబాబు, తాతపూడి దొరబాబు, పడిపే పాపారావు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు భేష్

రాజోలు: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంపై కేంద్ర ప్రభుత్వ ప్రభాకరీ అధికారి డాక్టర్ శోభిత్ గుప్తా సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం పాదలాడ గ్రామంలో వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించిన తీరును ఆయన పరిశీలించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను సంబంధిత అధికారులు ఆయనకు వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, రుణాలు, సబ్సిడీ పథకాల గురించి అవగాహన కల్పించారు. రైతులకు డ్రోన్ ఉపయోగించడం ద్వారా కలిగే లాభాలను వ్యవసాయాధికారులు శోభిత్‌గుప్తాకు వివరించారు. పాదలాడ గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఆయన అందజేశారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ క్రాంతికుమార్


రామచంద్రపురం రూరల్: భీమక్రోసుపాలెంలో మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ద్రాక్షారామకు చెందిన భీమేశ్వర దంత వైద్యశాల వైద్యుడు డాక్టర్ బచ్చు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. ముందుగా దంతాలు పాడైపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం దంత పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, పేస్టులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సున్న త్రినాథ్ కుమార్, హెచ్ఎం కె.వీరన్న, ఉపాధ్యాయులు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పి.సురేష్, కె.వెంకటలక్ష్మి, ఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా కల్యాణ్‌బాబు

మామిడికుదురు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుడిగా కారుపల్లి కల్యాణ్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మామిడికుదురు జెడ్పీ హైస్కూల్‌లో ఎస్టీయూ మండల శాఖ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు నేరేడుమిల్లి సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొమ్ముల వీరరాఘవరావు, ఆర్థిక కార్యదర్శిగా సయ్యద్ రజీ, అబయ్ కన్వీనర్‌గా వలవల శ్రీబాలాజీ, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా వడ్లమూడి రాజు, సీపీఎస్ కన్వీనర్ నేల వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, చిట్టినీడి చిరంజీవి, హరినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉండవల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలికాలం.. జీవాలు అప్రమత్తం

- గొర్రెలు, మేకలకు తిక్కరోగం సోకే అవకాశం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టం
- పశు వైద్యాధికారి కృష్ణార్జున్



ఎం.కృష్ణార్జున్, పశువైద్యాధికారి



మేకలను మేపుతున్న పెంపకందారుడు

కె.గంగవరం: చలికాలంలో గొర్రెలు, మేకల పెంపకందారులు ముందస్తు చర్యలు తీసుకోకపోతే జీవాలు వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని పశువైద్యాధికారి డాక్టర్ ఎం.కృష్ణార్జున తెలిపారు. ముఖ్యంగా పీపీఆర్(పారుడు), ఆర్స్‌వ్యాధి, మశూచి, చిటుక తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రోగంతో ఉన్న జీవాల నుంచి వ్యాధికారక సూక్ష్మజీవులు మందలో ఉన్న మిగిలిన వాటికి కూడా రోగాన్ని వ్యాప్తి చేస్తాయన్నారు. ఈ మేరకు గొర్రెలు, మేకల పెంపకందారులు తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు రాకుండా చూడొచ్చన్నారు.

చలికాలంలో..

దోమలు, కీటకాల బారి నుంచి గొర్రెలు, మేకలకు చలి కాలంలో తిక్క(సర్ప) రోగం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీన్ని త్వరగా గుర్తించకపోతే మృతి చెందే అవకాశాలుంటాయి. ముందస్తు చర్యల్లో భాగంగా సాయంకాలం పాకల వద్ద, మందల వద్ద వేపాకు ధూపం, రాత్రి పూట మంట పెట్టాలి. కీటకాలు మంటకు ఆకర్షితులై వ్యాధులు దరిచేరవు.

రక్షణ చర్యలు

గొర్రెలు, మేకలకు చలిబారి నుంచి రక్షించడం కోసం పాకలను ఏర్పాటు చేసి వాటికి న్యూమోనియా(ఉమ్మి) వ్యాధి సోకకుండా కాపాడుకోవాలి. గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే వాటిని గుర్తించి మంద నుంచి వేరు చేయాలి. ప్రత్యేక ప్రదేశంలో ఉంచి చికిత్స చేయించాలి. వ్యాధి సోకిన జీవాలకు సులువుగా జీర్ణం అయ్యే ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు ఇవ్వాలి. పూర్తిగా వ్యాధి నుంచి కొలుకున్న తర్వాత మాత్రమే వాటిని మందలో కలపాలి.

అప్రమత్తం అవసరం

వ్యాధులు సోకిన గొర్రె లేదా మేకలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు. ఒకవేళ గొర్రె లేక మేక మృతిచెందితే, వాటి కళేబరాలను ఊరికి దూరంగా తీసుకువెళ్లి లోతుగా గొయ్యి తవ్వి, సున్నం వేసి పూడ్చి పెట్టాలి. వ్యాధులు సోకి గొర్రెలు, మేకలు చనిపోయిన చోట ఈ ప్రదేశాన్ని క్రిమిసంహారక ద్రావణంతో పరిశుభ్రపరచాలి. చనిపోయిన జీవి తినగా మిగిలిన గడ్డిని కూడా కల్చివేయాలి. నీటి పాత్రలను క్రిమిసంహారక ద్రావణంతో కడిగి ఎండలో ఆరబెట్టాలి. ఇలా జాగ్రత్తలు పాటిస్తే ఇతర గొర్రెలు, మేకలను సులువుగా కాపాడుకోవచ్చు.

పంట నమోదు చేయించుకోవాలి



కందులపాలెంలో పంట నమోదు ప్రక్రియ పూర్తి చేస్తున్న ఏఓ సత్యప్రసాద్, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని రైతులంతా దాళ్వా పంట నమోదు ప్రక్రియ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ అన్నారు. కందులపాలెంలో గురువారం పొలాలను పరిశీలించారు. రైతులను కలసి దాళ్వా పంటకు విత్తనాలు వెదజల్లుకోవాలని వివరించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద పంట నమోదు ప్రక్రియ మొదలైందన్నారు. రైతులు పంట నమోదు చేయించుకుని, ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని కోరారు.

సొసైటీల బలోపేతానికి కృషి చేయాలి



కాకినాడలో డీసీబీబీ చైర్మన్ వీర్రాజును సత్కరిస్తున్న సహకార సంఘాల చైర్మన్లు

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలోని సొసైటీల బలోపేతానికి కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజును కోరినట్టు పలు సొసైటీల చైర్మన్లు తెలిపారు. కాకినాడలోని జి కన్వెన్షన్‌లో గురువారం నిర్వహించిన 127వ మహాజన సభకు మండపేట, వల్లూరు, మాచర, కపిలేశ్వరపురం, టేకి సొసైటీల చైర్మన్లు పెంకే గంగాధర్, ముత్యాల సతీష్ కుమార్, కర్రెడ్ల శ్రీనుబాబు, పెంటపాటి వెంకన్నబాబు, పుట్టా జానకిరామయ్య హాజరయ్యారు. తొలుత ఆకుల వీర్రాజును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆయా సహకార సంఘాల నిర్వహణ తీరును, రైతుల సమస్యలను వివరించినట్టు చైర్మన్లు తెలిపారు.

పలువురికి మున్సిపల్ చైర్‌పర్సన్ పరామర్శ



మండపేటలో పరామర్శిస్తున్న పతివాడ నూక దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): ఆప్తులను కోల్పోయి బాధల్లో ఉన్న పలువురుని మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి గురువారం వారి వారి ఇళ్ళకు వెళ్ళి పరామర్శించారు. అత్తను కోల్పోయిన 29వ వార్డు సచివాలయ కన్వీనర్ మీసాల రమణ, కుమార్తె వియోగంతో బాధపడుతున్న 8వ వార్డు గృహ సారథి కొడమంచిలి సుబ్బారావు, ఇటీవల మృతి చెందిన సంఘం కాలనీకి చెందిన వాసిరెడ్డి ఏసు, వైఎస్సార్ కాలనీకి చెందిన జ్యోతుల సత్యనారాయణ, 4వ వార్డుకు చెందిన పడాల సుబ్బన్న కుటుంబాల సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు,షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్‌బాబా, కౌన్సిలర్లు పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, నాయకులు మొండి మురళి, గండి నాగేశ్వరరావు, పేరూరి మాధవి, రెడ్డి రత్తయ్య, కొడమంచిలి వేణు, ఉండ్రాజవరపు అర్జున్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపాలానికి చెందిన వ్యక్తి గుత్తుల వెంకన్న(42) అప్పుల బాధతో ఆత్మహత్య యత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ద్రాక్షారామ ఏఎస్సై ఎస్.దుర్గాబాయి కథనం ప్రకారం.. వెంకన్న గ్రామంలో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. రెండేళ్లుగా పంట నష్టం రావడంతో అప్పుల పాలయ్యాడు. ఈ నెల 26న పురుగు మందు తాగాడు. బంధువులు రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్సకు కాకినాడ జీజీహెచ్‌కు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

గొల్లపాలెంలో మహిళ..

కాజులూరు: గొల్లపాలేనికి చెందిన మద్దిల సాయికుమారి(23) పురుగుమందు తాగి మృతిచెందింది. గొల్లపాలెం పోలీసుల కథనం ప్రకారం.. సాయికుమారికి మతిస్థిమితం లేదు. బుధవారం రాత్రి పురుగుమందు తాగడంతో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం చనిపోయింది. ఎస్సై ఎం.తులసీరామ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.